నేను చేసిన పని?

జడ్జిగారూ, నాకు మీరు వురిశిక్ష వేస్తారు, అంతేనా ? కానీండి ! నేను చేసిన పనికి తగిన శిక్షేనని నేనిప్పుడే వప్పుకుంటున్నాను. కాని తక్కిన మావాళ్ళు చేసిన పనులకి యేం శిక్ష వేస్తారు ! వాళ్ళ నసలు కోర్టుకి రప్పించనేలేదే ? మీ "లా" ప్రకారం వాళ్ళు చేసినపని తప్పులన్నా కావే? పోనీండి. హత్య చేశాను. కాని చేసినందుకు నాకు ఒక్కరవ్వ దిగులు లేదు. నేను పుట్టింతర్వాత చేసిన మహాసుకృత మదివక్కటే. స్వర్గమే వుంటే, న్యాయం విచారించే దేవుడే వుంటే, నాకు వెంటనే స్వర్గమిస్తాడు. నేను చేసిన పని నన్నానందంలో ముంచేస్తోంది.

ఈ ఘోరానికంతా నా భార్య కారణం, నా చెల్లెలిని బీదకుటుంబం వాళ్ళకిచ్చాము. దానికి వొక్కడే కొడుకు. నా చెల్లెలినీ, నా బావనీ చూస్తే నాకెంతో ప్రేమ. నాకిద్దరు కూతుళ్ళు. నా పెద్ద అమ్మాయిని తన కొడుకు రాముడికిమ్మని నా చెల్లెలు అడిగింది. నాకు చాలా సంతోషమయింది. కాని చివరికి వీలయింది కాదు. కారణం నా భార్య అల్లరి. ఏం చెయ్యను? సంసారంలో శాంతి వుండాలా? వేరే సంబంధం చేశాను, డబ్బున్నవాడికి. మా బావ పోయినాడు. నా చెల్లెల్ని వచ్చి మా ఇంట్లోనే వుండమన్నాను. కాని తెలివిగలది ! నా చెల్లెలు వప్పుకుంటుందా? నా భార్య సంగతి తెలీదూ ? నమస్కారం పెట్టి రానన్నది. కాని పాపం భర్త పోయిన యాడాది లోపలనే ఆ దిగులుతోనే అదీ పోయింది. పోయేముందు నాకు తన కొడుకుని పదహారేళ్ళవాణ్ణి వప్పగించి, చిన్నమ్మాయినిచ్చి అతనికి పెళ్ళి చెయ్యమని కాళ్ళు పట్టుకుంది. తలుచుకుంటే నా కళ్ళంబడి యిప్పుడు నీళ్ళు కారుతున్నాయి. సిగ్గుతో నా మొహం మాడిపోతోంది. ఆ పెళ్ళి నా భార్య పడనీదని నాకు అప్పుడే తెలుసు. అయినా చావు మంచంమీద చెల్లెలట్లా వేడుకుంటే, నేనేం చెప్పను ? అందికదా- "తల్లీ దండ్రీ లేడివాడికి నువ్వు గాక దిక్కెవరన్నయ్యా! నీ హృదయం మంచిదే. కాని వదిన అట్లా విరుద్ధంగా వుంటే, నువ్వేం చెయ్యగలవు? రాముణ్ణి యింటో వుండ నిస్తుందా? అమ్మణ్ణిచ్చి చేస్తే, అల్లుడని వొదినకి కూడా దయవొస్తుంది. నామీద వొట్టెయ్యి యిస్తానని" అంది.

రాముడు మాయింటోనే పెరిగాడు అప్పణ్ణించి. నా రెండో అమ్మాయి అమ్మన్నమీద నాకు చిన్నప్పటినించి చాలా ప్రేమ. తండ్రి కూతుళ్ళకంటే స్నేహితులలాగుండేవాళ్లం. యిద్దరం భారతం, రామాయణం కలిసి చదువుకున్నాం. ఒక్కరోజు నేను వూళ్ళో లేకపోతే గిజగిజలాడేది. యిప్పుడు మాతో రాముడు కూడా కలిశాడు. నా భార్యకి రాముణ్ణి చూస్తే నిష్కారణంగా ద్వేషం. ఆమె తిట్లు తప్పించుకోడానికి ముగ్గురం యే మూలో, దొడ్లో, యే చెట్టుకిందో చేరేవాళ్ళం. కథలూ, కబుర్లూ, నీతులూ, మహాత్ముల చరిత్రలూ, అన్నీ చదివి, చర్చించుకునేవాళ్ళం. రాముడంత మంచి కుర్రవాణ్ని నేనెన్నడూ చూడలేదు. చాలా బాగా

చదువుకునేవాడు. వూళ్ళో అందరికీ అతని మీద ప్రేమ, నా భార్యకీ తప్ప. అతను అణకువగా వున్నకొద్దీ ఆమెకి కోపం ఎక్కువ అయ్యేది.

మొదటినించీ అందరితోనూ అమ్మడికీ రాముడికీ సంబంధం నిశ్చయమైనట్లే మాట్లాడుతూ వొచ్చాను. నా భార్య మాత్రం మాట్లాడేది కాదు ఆ విషయమై. అమ్మడికి పదకొండేళ్ళొచ్చాయి. వైశాఖమాసంలో ముహూర్తం పెట్టాను. నా భార్య ఆ విషయమై యేమీ జోక్యం కలుగ చేసుకోలేదు. నాకు చాలా సంతోషమయింది. అంత సులభంగా పోనిస్తుందని ఎన్నడూ నేననుకోలేదు.

మాఘమాసంలో నా భార్యా, అమ్మన్నా, నా బావమరిది పెళ్ళికి వెళ్ళారు. రాముడూ, నేనూ, ముసలమ్మా మాత్రమే ఇంట్లో వున్నాం. నా కుటుంబం తిరిగి వొచ్చారు. అమ్మడు బండిలోంచి దిగింది. నా కళ్ళు తిరిగి పోయినాయి. కింద పడిపోయినాను. పసుపుచీరా మెళ్ళో బంగారు చిప్పలూ నల్లపూసలూ, అమ్మన్న తయారయింది. రాగానే నన్ను కావిలించుకుని బిగ్గిరిగా యేడ్చింది. చిరునవ్వు నవ్వుకుంటూ, కులుకుతూ, బనారసు చీర కట్టుకుని, ఆ బట్టతలా, పీచుజుట్టూ, చీకిరి కళ్ళేసుకని, యిప్పటికి కలల్లో యే మొహం మహా ద్వేషం పుట్టిస్తో వుంటుందో ఆ మొహంతో నా భార్య దగ్గిరికొచ్చింది. "మీతో చెప్పకుండా యీ పని చేసినందుకు క్షమించాలి" అంది. అనకుండా యింటోకి పోతే సహించేవాణ్ణే ఎట్లాగో వొకలాగు. ఆ మాటతో తోచింది నాకు, మొగవాడికి బలమెందుకుందో. రోడ్డుమీదే, ఈడ్చి దవడమీద కొట్టాను. అదిరి కిందపడ్డది. అదే నేను మొదటిసారీ, ఆఖరుసారీ, ఆడదాన్ని కొట్టడం.

పాపం నాన్నతో చెపుతానని అమ్మడి పెళ్ళిముందు చాలా యేడ్చిందట. ఆ పెళ్ళి నేను రద్దు చేయించవొచ్చని కూడా అన్నారు కొందరు. ఆ ధైర్యం నాకు లేకపోయింది. అంతమాత్రం ధైర్యంముంటే, సంగతులిట్లా యెందుకు తటస్థిస్తాయి? కనపడ్డప్పుడల్లా రాముడు దిగులుతో నావంక చూసేవాడు. అమ్మడు ఒకటే యేడుపు. వాళ్లయిద్దర్నీ నాభార్య ఒకటే తిట్లు. రాముడి మొహం చూసినప్పుడల్లా నా చెల్లెలు మరణశయ్య. ఆమె మరణశయ్యా, నా వాగ్దానం అన్నీ జ్ఞాపకమొచ్చేవి. అమ్మడూ రాముడూ ఒకరితో వొకరు మాట్లాడుకోడం మానేశారు. రాముడి స్థితి మా యింట్లో మరీ దుస్సహమయిపోయింది. నా భార్య వాణ్ని నా యెదురుగా నానా తిట్లు తిట్టడం మొదలు పెట్టింది. ఏమన్నా అంటే రాగాలూ, రోడ్డుమీద అరవడమూనూ, ఏం చెయ్యను ? రాముడు నా యింట్లోంచి వెళ్ళి వేరే గదిలో వుండి భోజనానికి మాత్రం వొచ్చేవాడు. ఇంక ఆ రోజులెట్లా గడిచాయో తెలీదు.

పెళ్ళైన యేడాదిలోపుగానే నా భార్య చచ్చిపోయింది. కాని యిప్పటికీ దానిమీద కోపం పోలేదు. ఈ దుర్దశకంతా అదే కారణం. ఇక ఆ అల్లుడితో వ్యవహారాలు నా నెత్తిన పడ్డాయి. ఆయన పేరు నాగేశ్వర్రావు, వకీలు. ఆయన తాతో, ముత్తాతో, డిప్యూటీ కలెక్టరుపని

చేశాడట. అదీ గర్వం. అతనొక్కడే ఈ లోకంలో బి.యల్. అయినట్లు మాట్లాడేవాడు. అమ్మన్నకి నా ఆస్థిలో సగంభాగం రాయించి యిస్తానని నా భార్య అతన్తో చెప్పిందట. రాముడికి ఈ ఆస్తి యిస్తానేమోనని, ఆ అల్లుడికి బెంగపట్టుకుంది. ముందే తనకి సగం ఆస్తి రాసియ్యమన్నాడు. వీల్లేదంటే, పోట్లాడాడు. అడ్డమైన తిట్లూ తిట్టాడు. దావా తీసుకొస్తానన్నాడు. ఏంచెయ్యను ఛండాలుడు, పరమనీచుడు, బానిస కావడం మంచిది - ఈ దేశంలో, ఆడపిల్ల తండ్రి కావడం కంటే. అన్ని తిట్లు తినీ వూరుకున్నాను.

అమ్మన్నని అత్తవారింటికి పంపాను. నేను ఆస్తి రాసియ్యలేదనే కోపంతోనూ, అమ్మన్న మెత్తని స్వభావాన్నీ చూసీ, అత్తమామలూ, తోడికోడళ్ళూ బాధించడం మొదలుపెట్టారు. నన్ను బతిమాలి ఆస్తి రాయించి యియ్యమని అమ్మన్నని బలవంతం చేశారు దానిచాతే. పెడుతున్న బాధలూ, పెట్టనివీ, అన్నీ నా గుండె బద్దలయ్యేట్టు వుత్తరాలు రాయించారు. నేనా వూరువెళ్ళి, దాన్ని పంపమని అడిగాను. ఆస్తిరాసిస్తే పంపుతామన్నారు.

ఒక యాడాది అయింతరవాత, అమ్మన్న గర్భిణీతో వుందనీ, కాన్పుకి తీసుకెళ్ళమనీ, రాశారు. చాలా సంతోషంతో తీసుకొచ్చాను. అమ్మన్న అత్తవారింటికి వెళ్ళింతరవాత, నా వొంటరితనాన్నిచూసి, జాలిపడి రాముడు నా యింట్లోనే వున్నాడు. ఆ ఊళ్ళో కలెక్టరాఫీసులో హెడ్ గుమాస్తా వుద్యోగం అతనికి. అతను పెళ్ళి సంగతెత్తితే మాట్లాడేవాడు కాదు. యెదిగిన కూతుళ్లకి మొగుళ్ళని వెతికే దౌర్భాగ్యుల్ని గుమ్మం తొక్కింతే తిట్టి వెళ్ళకొట్టేవాడు. యెదిగినవాడు వొంటరిగా, అట్లా బ్రహ్మచారిగా కాలం గడుపుతో వుంటే నాకు యెంతో దిగులేసేది.

అమ్మన్నని తీసుకొచ్చిన రోజు మా యిద్దరికీ పెద్ద ఉత్సవంలాగుంది. అమ్మన్నకి పరిచర్య చెయ్యడానికి ఒక ముసలమ్మని తీసుకొచ్చాం. రాముడు ఆఫీసునించి రాగానే, ముగ్గురం యేవో పిచ్చి ఆటలు ఆడేవాళ్ళం, చదువుకునేవాళ్ళం, మాట్లాడుకొనేవాళ్ళం. అమ్మన్న యేమన్నా చెయ్యమని అడిగితేచాలు, యిద్దరం పరిగెత్తుకెళ్ళేవాళ్ళం. ఏది కావాలంటే అది యిద్దరం కొనుక్కొచ్చి యిచ్చేవాళ్ళం. ఒకరోజు అమ్మన్న "నాన్నా పుట్టినప్పణ్ణించి యింత సౌఖ్యం యెరగను. యిద్దరు మొగాళ్ళు నాకిట్టా సేవచేస్తూ వుంటే, రాణిలాగుంది నా పని" అంది. అమ్మన్న వెళ్ళిపోయే రోజు తలుచుకుని వొణికాను.

కొద్దిరోజుల్లో కొత్త విషయం ఒకటి సంభవించింది. ప్రేమదాగడం కష్టం. మధుర స్వరాలతో మోగుతుంది. మృదుదుష్టులతో ప్రకాశిస్తుంది. అమ్మన్నకీ రాముడికీ ఎప్పుడూ ఒకరిమీదే ఒకరికి కళ్ళు. నాకు భయమేసింది. కాని తండ్రిని నేనేమనను ? అయినా మునిగిపోయిందేముంది? వాళ్ళకి చెడ్డ తలంపులున్నాయని నేను ముందే యెందు కనుకోవాలి?

ఇంతలో కాన్పొచ్చింది. మేమిద్దరం ముసలమ్మల్లాగ గది తలుపులు దగ్గిర కూచున్నాము వొణుకుతో. అమ్మాయి వొకమూలుగు మూలిగినప్పుడల్లా మేమిద్దరమూ

చెరివొక పెద్దమూలుగూ మూలిగేవాళ్ళం. ఇద్దరం చెరో మంత్రసాన్నీ, చెరో డాక్టర్నీ ఏర్పరిచాము. ఏమీ అక్కర్లేకపోయినా ఏదో అమ్మన్న కాన్పుకి మా ఇద్దరి అవసరం వున్నట్టే యిల్లంతా పరిగెత్తాము. నేను వేణ్ణీళ్ళు మంటపెట్టాను. రాముడు కాఫీ కాచాడు. ఇద్దరం తలుపుదగ్గిరికెళ్ళి "వేనీళ్ళు కావాలా", "కాఫీ కావాలా!" అన్నాము. వాళ్ళు నవ్వారు. రెండూ అక్కడే పారేసి, యెవరికోసమో వెళ్ళినట్లు వూళ్ళో కొంచెం తిరిగేదీ, మళ్ళీ పని ముంచుకు పోయినట్లు ఇంటికొచ్చి "యెట్లా వుంది ?" అని అడిగేదీ, అట్లా గడిపాము ఆ రాత్రంతా. "రేపుగాని కానపుగాదు. వెడతానని" మంత్రసాని అంటే బయట తలుపు తాళమేసి ఆ లావాటిదానికి అడ్డమైన చాకిరీచేసి ఇంటోనే వుంచేశాము. చివరికి అట్టే కష్టం లేకుండానే కన్నది. ఆడపిల్ల పుట్టింది. కాని నాలుగో రోజునే అమ్మన్నకి వాతం కమ్మింది. మా ఇద్దరిలో వొకరికంటె వొకరికి మతిపోయింది. అత్తవారికి టెలిగ్రాము యిచ్చాం. ఒకరూ రాలేదు. ఆ డాక్టర్లని కదలనియ్యము. పరిరోజులు మేము పడ్డవేదన యింతంత కాదు. చివరికి నెమ్మదించింది. ఇద్దరం మొక్కుబళ్ళూ, సమారాధనలూ, పూజలూ, చేయించాము.

రాముడు నెలరోజులు శెలవుపెట్టి, అమ్మన్న నిద్రపోకుండా చదువుతో అక్కడే కూచునేవాడు. అమ్మన్నని ఒక్కనిమిషం వొదిలి వుండడు. వాడి కళ్ళల్లోనే వాడి మోహమంతా తెలుస్తోంది. కాని అమ్మన్న మా ఇద్దరినీ మరిచిపోయింది. ఆ బిడ్డే లోకం. ఒకరోజు నేనట్లా వెడుతో వుంటే అమ్మన్న కోపంతో అంటున్న యీ మాటలు వినబడ్డాయి. "వద్దన్లేదూ? అట్లా చేస్తే, ఇక్కడికి రావొద్దు." అప్పటినించి అమ్మన్నని చూస్తే నాకో విధమైన భక్తి ఏర్పడ్డది. రాముణ్ణి చూసినకొద్ది జాలివేసేది. వాడు సంతోషంగా వుండడమే మానేశాడు.

ఇంతలో అత్తవారు బారసాల చెయ్యమని ఉత్తరం రాశారు. మంచి రోజూ అదీ చూసి వుత్తరం రాయాలనుకొంటూ వుండగా, ఆ చంటిపిల్లకీ జబ్బుచేసి పోయింది. అమ్మన్న చాలా ఏడ్చింది. దాన్ని చూస్తే మా ఇద్దరికీ ఏడుపు ఆగలేదు. అత్తవారు ఒక్కరూ రాలేదు. బారసాలకైతే వస్తామన్నారు. కొత్తబట్టలొస్తాయనేమో? ఇప్పుడెందుకొస్తారు? ఇట్లా మరికొన్ని రోజులు గడిచాయి. అమ్మన్నని అత్తవారింటికి పంపవొద్దా అని ఆలోచన తట్టింది.

ఇట్లా వూరుకుంటే వాళ్ళు పంపమని అడిగేట్టేలేరు. అమ్మాయితో ఆ మాటంటే, వాళ్ళకి లేని తొందర నీకెందుకంది. అవును, ఎందుకు పంపడం, అడగంది? ఇట్లా వుంటేనేం అనుకున్నా, అమ్మన్న వెళ్ళడం నాకు ఇష్టంలేదు. అమ్మన్నకీ ఇష్టంలేదు. వాళ్ళకీ అక్కర్లేదు. ఇంక వెళ్ళడం యెవరికోసం? సంబంధంలేని ఈ లోకం కోసం, పొరుగింటి పుల్లమ్మ ఏమనుకుంటుందో అని పంపాలి. అయితే అమ్మన్న ఇప్పుడు ఇట్లా అంటుందిగాని, భర్తని వొదిలి యెన్నాళ్ళని ఇట్లా వుండగలదు?

ఇంతలో ఇంకో విషయం తెలీడం మొదలుపెట్టింది నాకు. పిల్ల పోయిం తర్వాత సందర్భాలు మారాయి. అమ్మన్న రాముణ్ని వొదలడం లేదు. వాణ్ణి కచేరికెళ్ళనీదు, ఇంకోపని చెయ్యనీదు. తనతో నవ్వాలి. కబుర్లు చెప్పాలి. ఇద్దరూ నన్ను మరిచిపోయినారు. నేను

దగ్గిర లేకపోతేనే బావుంటుంది. మోహమంత స్వార్థపరమయింది యింకోటిలేదు. ఏమవుతుందో అని నాకు భయం చాలా ఎక్కువయింది. ఎట్లానన్నా విడతియ్యాలి. కాని ఆ సంతోషాన్ని యెట్లా చేతులారా చెడగొట్టను? తప్పే కావొచ్చు. నాకున్నదల్లా వాళ్ళిద్దరు. వాళ్ళ సౌఖ్యం కాకపోతే నాకింకేంకావాలి? ఇద్దరికీ యెడబాపి ఆ దుఃఖంచూసి సంతోషించానా, నీతికోసం ఆ పనిచేసి ధైర్యవంతులమనీ, నీతివిదుల మనీ సంతోషించే వారుంటారు. కాని నాకు చేత కాలేదు ఆ పని. చివరికి రోజా మించిపోతున్న ఆ అన్యాయాన్ని చూసి వోర్చుకోలేక, కళ్ళుకుట్టి, నీతికీ, ప్రతిష్టకీ జడిసి, హృదయము రాయి చేసుకొని, అత్తవారికి అమ్మాయిని వెంటనే తీసుకెళ్ళమని రాశాను. జవాబు రాలేదు. మళ్ళీ మళ్ళీ రాశాను. చివరికి అంత జరూరయితే తీసుకొచ్చి దిగపెట్టమన్నారు. వాళ్ళిద్దరితోనూ అత్తవారు తొందరచేసి రాస్తున్నారని అబద్ధాలు చెప్పాను. అటు తరువాత నామీద నాకే గౌరవము పోయింది. కటికవాడి పని, నీచమైన దొంగపని చేసినట్లయింది. కళ్ళెత్తి వాళ్ళ మొహాలు చూడలేకపోయినాను. కాని అమ్మన్న యెన్నాళ్ళకీ కదలలేదు. ఎంత బలవంతం చేసినా ప్రయాణం కాదు. చివరికి "నేనింట్లో వుండడం నీకిష్టం లేనట్టుందే నాన్నా! వెడతాలే నిశ్చింతగా వుండు" అని ప్రయాణమయింది. నాకేడుపొచ్చింది. ఇద్దరూ ఒక దేహం చీలిపోయినట్లు బాధపడుతున్నారన్న సంగతి నాకు తెలుసు. నీతి, ధర్మం, పాతివ్రత్యం యీ పేర్లు జపంచేస్తో నేను నా మనసులోంచి, కరుణనీ, ప్రేమనీ చంపేసి, అమ్మన్నని తీసికెళ్ళి అత్తవారింటో దిగపెట్టి వొచ్చేశాను.

రాముడు నాతో సరిగ్గా మాట్లాడ్డం మానేశాడు. ఏం చెయ్యను? లోపల కుళ్ళుతూ వూరుకున్నాను. నేను చేసినా పాపం, నా పెళ్ళాంతెచ్చినట్టి దౌర్భాగ్యం, నా యిద్దరి పిల్లల గొంతుకోసింది! అమ్మడు రాముడికీ ఉత్తరాలు రాయడం మొదలుపెట్టింది. అతను ఆ ఉత్తరాలలో భాగాలు కత్తిరించి నా ముందర పడేసి వెళ్ళేవాడు. అమ్మన్న భర్తకి ఒక తమ్ముడుండేవాడు. అతను చచ్చిపోయిన తరువాత నా అల్లుడు తమ్ముడి భార్యను ఇంట్లో అట్టేపెట్టేసుకున్నాడు. ఇప్పుడు అమ్మన్న మొహాన తిట్లూ, చివాట్లు తప్ప ఇంకేమీ లేవు. కొట్టడం కూడా మొదలుపెట్టాడని రాసింది. ఇక్కడ రాముడు రోజు రోజూ చిక్కిపోతున్నాడు. నాతో ఏదో మాట్లాడటానికి చూస్తాడు, మళ్ళీ మానేస్తాడు. నాకు భయమేసింది. ఉద్రేకంలో ఏమి మాట్లాడేస్తాడో అని. చివరికి వొకరోజు రాత్రి యెత్తాడు.

"అమ్మన్న స్థితి చూశారుకదూ? తీసుకురారేం?"

"తీసుకొచ్చి ఏం చేసుకోను? భర్తని వదిలి యెన్నాళ్ళని వుంటుంది?

"ఆ భర్త దగ్గరవుండి లాభమేమిటి ! చాకిరీ దెబ్బలాట తప్ప"

"లోకం ?" అన్నాను.

"లోకం ? వెధవలోకం. అమ్మన్నని ఆ పెనిమిటి సరిగా చూసేటట్టు చెయ్యదేం? వెళ్లనూ అని ఏడుస్తున్నదాన్ని లాక్కెళ్ళి దిగపెడితిరి. ఇప్పుడిట్లా వూరుకుంటారా ?"

"నేనేమీ మాట్లాడలేదు. నేను పడ్డ బాధ రాముడికేం తెలుసు? నా యిద్దరు పిల్లలూ నా మీద విరోధం కడితే నేను బతకడమెందుకు? నాకింక లోకమేముంది. అన్యాయంగా నామూలంగా లోకాన్ని చూస్తే నాకున్న జడుపు మూలంగా కద నా బిడ్డలిద్దరూ యిట్లా కష్టపడుతున్నది? నీతి అని పేరుపెట్టి, వాళ్ళ ఖర్మమని సమాధానపరుచుకుని వూరుకునే తల్లిదండ్రులున్నారు. కాని యెందుకో నేనూరుకోలేకపోయినాను. అమిత బాధపడ్డాను. వారం రోజుల్లో అమ్మన్న నాకే రాసిది. తన భర్త డొక్కలో తన్నాడనీ, యీసారి వాత పెడతా నన్నాడనీ, తాను బావిలోపడిపోతాననీ, ఇంక ఆ రోజుల్లా యమబాధపడ్డా, దాన్ని తీసుకురావాలని కూడా అనుకున్నా, కాని లోకం?

ఆ రాత్రి రాముడు యింటికి రాలేదు. యెవరిడగినా తెలియదన్నారు. యీ భూమిమీద ఎందుకున్నానా అనిపించింది నాకు రాత్రి. మర్నాడు సాయంత్రానికి అమ్మన్నని తీసుకొని రాముడు వొచ్చేశాడు. నాకు చాలా సంతోషమూ, భయమూ వచ్చాయి. అత్తవారు పంపనంటో వుంటే బలవంతంగా ఇద్దరూ వొచ్చేశారు. ఏమీ అనకుండా వూరుకున్నాను. మళ్ళీ అమ్మన్నని పంపే వుద్దేశ్యం నాకుపోయింది. వీళ్ళిద్దరూకలిసి యెందుకుండకూడదూ? అల్లుడు వేరేమనిషితో వున్నప్పుడు! నాకూతురక్కడే ఎందుకు పరిచర్య చేస్తో పడివుండాలి? భార్యగా ఇచ్చానా, దాసిగానా? నీతిశాసనంలో దాసిగా వుండనీననడం తప్పు కావచ్చు. కాని నా హృదయ శాసనంలో తప్పుగా కనపడటంలేదు. వీళ్ళద్దర్ని మళ్ళీ విడతియ్యనా? నాకూ కరుణ వుంది కొయ్యకాదు. నేనూ ప్రేమ అంటే కొద్దో గొప్పో యెరుగుదును. పాతివ్రత్యంలో నా ప్రేమ ఇంకా చావలా.

రెండో రోజుకల్లా నా అల్లుడు వొచ్చాడు. అమ్మన్నని వొక్క నిమిషం వొదిలి వుండేలేనట్లు వెంటనే పంపమన్నాడు. అమ్మన్న వెళ్ళనంది. రాత్రి పడుకోడానికన్నా అతని గదిలోకి వెళ్లలేదు. రమ్మన్నాడు. బలవంతం చెయ్యపోయినాడు. రాముడిమీద అతనికి చాలా అనుమానముంది. తన హక్కులో వున్న యీ నరమృగాన్ని, తనబానిసని, తనకెంత మాత్రము అక్కర్లేకపోయినా సరే, తను పెట్టే తిప్పలన్నీ పడుతో పడివుంవలసిందే గాని, ఇంకోడు తీసుకోకూడదు. ఇంకొకరిమీద మనసు ఆ భార్యకి పుట్టకూడదు. దేహమే కాదు, మనసూ, ఆత్మా అన్నీ తనవే. తనకి కావలసినా సరే, అక్కర్లేకపోయినా సరే.

చిన్నప్పుడు మా గ్లాసులతో మా కక్కర్లేనప్పుడు కూడా, ఇంకోళ్ళని మంచినీళ్ళు తాగనిచ్చేవాళ్లం కాదు. మాకక్కర్లేకుండా పారేసిన పీలికనైనా సరే. యింకోడు మహాభాగ్యమని ఏరుకుంటే, ఇచ్చేయమని పోట్లాడి దాచుకునేవాళ్ళం. మేము పెంచుతున్న కుక్కపిల్ల, మేం దాన్ని తన్నినా సరే ఇంకోళ్ళవెంట పరిగెత్తే వూరుకోగలమా? స్త్రీల విషయంలో యీ యెదిగిన మొగాళ్ళు కూడా చిన్నబిడ్డల స్థితిలో వున్నారు. అట్లాంటి స్థితిలోనే, నా అల్లుడూ వున్నాడు. గదిలోపలికి అమ్మన్నని నెట్టాడు. రాముడు అడ్డుపడ్డాడు. ఇంక సరేసరి, తిట్లూ 'నువ్వెవడవంటే నువ్వెవడవడం, కొట్టుకోడం కూడాను. నేనడ్డపడి వొదిలించాను.

మర్నాడు అల్లుడు ఎవర్నో పెద్ద మనుషుల్ని తీసుకొచ్చాడు. అమ్మన్న వెళ్లనంది. నేనూరుకున్నా, పోలీసు రిపోర్టు చేస్తానన్నాడు. యింకేం చెయ్యను? అమ్మన్నతో విశదంగా చెప్పి వెళ్ళక తప్పదన్నాను. వెడుతూ, రాముడివంక అమ్మన్న చూసిన చూపు, మీరు నన్ను వురి తీసిన తరవాత కూడా జ్ఞాపకముంటుంది. ఆ చూపుతో నా మనస్సు పూర్తిగా మా అమ్మాయి దయిపోయింది. రాముడుపడ్డ బాధ యింక సరే సరి. తనదాన్ని, చిన్నప్పటినించి తనని ప్రేమించినదానిని, గొడ్డులాగు లాక్కుపోతే వాడికెట్లా వుందో? ఆ అమ్మాయి ఎట్లా వోర్చుకుందో?

మూడోరోజుకీ అమ్మన్న పరుగెత్తుకొచ్చింది. వాడు నా బిడ్డని పెట్టిన కష్టాలు మీతో నేను చెప్పగలిగితే, చెవులు మూసుకుని పారిపోని వారుండరిక్కడ. ఆ నరహంతుకుడు నా బిడ్డని తీసుకుని పోతో వుంటే చూస్తో వూరుకున్నానే అనే పశ్చాత్తాపంతో దహించుకోయినాను. రాముడు అన్నీ విని, నా ముందరే అమ్మన్నని కావిలించుకొన్నాడు. "యేమైనా గాని యింక నిన్ను వదలను. లోకంమతా కలిసినా సరే, మన్ని వేరుచెయ్యలేదు. వెధవనైపోయి ఓసారి వూరుకున్నా, యీసారి గుమ్మంలో అడుగు పెట్టాడంటే వాణ్ణి రివాల్వరుతో కాల్చి చంపి, నిన్ను రక్షిస్తా"నన్నాడు. కాని ఆ పని వాడుచేస్తే తరువాత వాడు బ్రతుకుతాడా? బతకనిస్తారా? వాడికీ వురి పడుతుంది. ఇంక నేనూ మిగిలేది? ఆ నిమిషంలోనే నేను చెయ్యవలసిందేమో నిశ్చయించుకున్నాను. నా భార్య దొంగపెళ్ళి చేస్తే వూరుకున్నాను. నా బిడ్డని వాళ్లు కష్టపెడితే వూరుకున్నాను. రాముడి ప్రేమ పెరగకుండా అబద్ధపు వుత్తరాలు రాశాను. నా అమ్మాయిని ఆ కటిక వాళ్ళదగ్గిరికి పంపాను. ఈ పరమ నరకపు కార్యాలకి లోబరచడానికి తీసుకుపోనిచ్చాను. రాముడూ అమ్మన్న పడ్డ బాధలన్నిటికి నేనే కారణం. ఈ పాపాలన్నీ యిప్పుడు పరిహారం కావాలి.

మర్నాటికే పోలీసువాళ్లని వెంటబెట్టుకుని నా అల్లుడు సిద్ధమైనాడు. అమ్మన్న రాకపోతే ఆస్తిరాదని అతనికి బెంగపట్టుకుంది. "ఇట్లా రమ్మని" నా అల్లుణ్ని పిలిచి, అందరూ వినేటట్లు యిట్లా అన్నాను. "నీ వంటి తుచ్ఛుడు యీ లోకంలోలేడు. దాన్ని ఆ బాధలన్నీ పెట్టిన కిరాతుడివి నువ్వు. ఆడదాని మొర వినే దిక్కులేని దేశం గనక యీ ఆటలన్నీ సాగాయి."లా"నీ పెళ్లామని దాన్ని నీకిస్తుంది. ఇంకో పెద్ద కోర్టుంది. దానికి నిన్ను పంపిస్తున్నాను".... గదిలో రాముడు రివాల్వర్‌కోసం వెతుకుతున్నాడు. తను సిద్ధంగా గుళ్లు పెట్టి వుంచుకున్నది నా చేతిలో వుందయ్యెను. పోలీసు ఇన్‌స్పెక్టరు పని నేనుచేసి వుండటం ఇప్పుడు పనికొచ్చింది. అల్లుడి గుండెల్లో కాల్చాను, చచ్చి కిందపడ్డాడు. రివాల్వరవతల పారేసి అమ్మడువంక చూశాను. అది ఆ చచ్చినవాడి వంకన్నా చూడలేదు. "అయ్యో నాన్నా ఏం ఒక పుణ్యకార్యం చేశాను" అన్నాను అంతే.

"చావబోయేముందు ఒక పుణ్యకార్యం చేశాను" అన్నాను అంతే.

వురి తియ్యండి. నాకేం చింతలేదు.

◆ ◆ ◆

ప్రచురణ : (భార్య కథలసంపుటి), స్టూడెంట్స్‌బుక్ సెంటర్